## క్లుప్తంగా

### మర్యాదపూర్వక భేటీ



ధనంజయ రెడ్డికి మొక్క అందజేస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్యదర్శి కె.ధనంజయరెడ్డిని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి గురువారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టెక్కలి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై విన్నవించారు.

### రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న రక్తదాత గ్రూపు సభ్యులు

కాశీబుగ్గ: రక్తదానంతో ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయవచ్చని రక్తదాత గ్రూప్ వ్యవస్థాపకుడు మామిడి వీర్రాజు అన్నారు. స్థానిక రాజేశ్వరి నర్సింగ్ హోమ్‌లో గురువారం ఉదయం రక్తదాత గ్రూప్‌ను ప్రారంభించి మాట్లాడారు. వందల మంది యువకులు, రక్తదాతలతో సంఘంగా ఏర్పడ్డామని, ఆపదలో ఉన్నామని ఎవరు తెలిపినా తక్షణమే హాజరై రక్తదానం చేస్తామని పేర్కొన్నారు. ఆపద సమయంలో 63021 85542 నంబర్‌కు కాల్‌చేసి సహాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రక్తదాతలు కె.క్రాంతి, వంశీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా ఓటర్ల సర్వే



గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని కస్తూరిపాడు సచివాలయం పరిధిలో బీఎల్వో బమ్మిడి కూర్మారావు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో ముమ్మరంగా ఓటర్ల సర్వే గురువారం నిర్వహించారు. గ్రామంలో 1,047మంది ఓటర్లు, 490 గృహాలుండగా ప్రస్తుతానికి 265 గృహాల సర్వే పూర్తి చేసినట్లు బీఎల్వో తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బమ్మిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన రెండేళ్ల వయస్సు గల కేన్సర్ బాధిత చిన్నారి గిన్ని నైమిష వైద్య ఖర్చుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన ఎస్ఎంఎస్ సేవా సంస్థ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందించింది. ఈ మొత్తాన్ని బాధిత చిన్నారి కుటుంబ సభ్యులకు సంస్థ అధ్యక్షుడు ఎ.నాని, సభ్యుడు ఎం.సురేష్‌లు అందజేశారు. మరింతమంది దాతలు ముందుకు రావాలని కోరారు.

### సముద్ర తీరాన్ని పరిరక్షించాలి



తీరంలో శ్రమదానం చేపడుతున్న సంఘ ప్రతినిధులు

సోంపేట: సముద్ర తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సముద్రాలను కలుషితం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఐఎఫ్ఎస్ఎస్ఎస్(ఇండియన్ ఫార్మర్స్, సోల్జర్ సేవా సొసైటీ) సేవా సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం బారువ సముద్ర తీరంలో శ్రమదానం చేపట్టారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతీ పౌరుని బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డి.నవీన్‌కుమార్, శివ, అఖిల్, ఈశ్వర్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర ప్రణాళికతోనే ఆర్థికాభివృద్ధి

కంచిలి: సమగ్రమైన ప్రణాళికతోనే స్వయంశక్తి సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించగలుగుతాయని వైఎస్సార్ కేపీ సోంపేట ఏరియా కో–ఆర్డినేటర్ కె.మోహనరావు పేర్కొన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 'ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ పాలసీ'పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి చేపట్టాల్సిన పద్ధతులను వివరించారు. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ జి.శ్రీధర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు పలికల ఎర్రమ్మ, కార్యదర్శి కె.లక్ష్మి, ఏపీఎం పి.ఉమారాణి, ఎస్.ఎన్.మేనేజర్ కె.రాము తదితరులు పాల్గొన్నారు.

# అతివకు అండగా..!



స్వయంశక్తి సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్న వైఎస్సార్ కేపీ సిబ్బంది

- డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం వరాలు
- సున్నా వడ్డీ వర్తింపుతో బలోపేతం
- నేడు నాలుగో విడత వడ్డీ సొమ్ము విడుదల

కంచిలి: మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మహిళల స్వయం ఉపాధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. ఈ దిశగా స్వయంశక్తి సంఘాల మహిళలకు పెద్ద ఎత్తున బ్యాంకు లింకేజీ రుణాలు అందజేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాలతో ఆదుకుంటున్నారు. దీంతోపాటు వారు బ్యాంకుల్లో తీసుకుంటున్న రుణాలకు వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్న డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా సున్నావడ్డీ నిధులను మహిళల ఖాతాలకు జమచేయగా, నాలుగో విడత వడ్డీ రాయితీ నిధులను శుక్రవారం విడుదల చేయనున్నారు.

| ఇచ్ఛాపురం నియోజకవర్గంలో లబ్ధిదారుల వివరాలు | | | |
|---|---|---|---|
| మండలం | సంఘాలు | సభ్యులు | మొత్తం లబ్ధి (రూ.కోట్లలో) |
| ఇచ్ఛాపురం | 1,303 | 14,418 | 1.73 |
| కంచిలి | 1,492 | 17,517 | 1.75 |
| కవిటి | 1,828 | 22,058 | 2.12 |
| సోంపేట | 1,912 | 22,604 | 2.53 |
| మొత్తం | 6,535 | 76,597 | 8.13 |

**సున్నావడ్డీ వర్తింపు ఇలా..**

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని సక్రమంగా వాయిదాలు చెల్లిస్తున్న సంఘాలకు వైఎస్సార్ సున్నావడ్డీ వర్తిస్తుంది. సంఘాలు తీసుకున్న అప్పు తేదీ, అప్పు మొత్తం, పొదుపు ఖాతాల నంబర్లు, బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తదితర వివరాలను మండలస్థాయిలో అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆయా వివరాలు ప్రకారం ప్రభుత్వం నుంచి నేరుగా స్వయంశక్తి సంఘాల సభ్యుల పొదుపుల ఖాతాలకు సున్నా వడ్డీ రాయితీ నిధులు జమవుతాయి.

### మాట తప్పని సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చినమాట ప్రకారం రాష్ట్రంలో సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తున్నారు. అదేవిధంగా మా డ్వాక్రా సంఘాలకు కూడా ఇప్పటివరకు 3 విడతలుగా సున్నావడ్డీ రాయితీని ఇచ్చారు. ఈ ఏడాది నాలుగో విడత నిధులు కూడా జమ చేస్తున్నారు. మాటతప్పని నేతగా డ్వాక్రా సంఘాల సభ్యుల మనసులో నిలిచిపోయారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి చక్కని తోడ్పాటునందిస్తున్నారు.

– పలికల యర్రమ్మ, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు, కంచిలి

### అర్హులందరికీ సున్నావడ్డీ



బ్యాంకు లింకేజీ రుణాల వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్న సంఘాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సున్నావడ్డీకి అర్హత సాధిస్తాయి. మండలంలోని ఉన్న 1492 సంఘాలకు రూ.1.75 కోట్ల సున్నా వడ్డీ నిధులు పొదుపు ఖాతాలకు జమ కాబోతున్నాయి.

– పి.ఉమారాణి, వైఎస్సార్ కేపీ, ఏపీఎం, కంచిలి

### మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి. స్వయం ఉపాధి యూనిట్లు, చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని మహిళా పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలి. ప్రభుత్వం ఇస్తున్న వైఎస్సార్ సున్నావడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి.

– కె.మోహనరావు, వైఎస్సార్ కేపీ, ఏరియా కో–ఆర్డినేటర్, సోంపేట

# నులిపురుగులపై నివారణాస్త్రం

- విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు

చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించే సూక్ష్మజీవులు నులిపురుగులు. ఇవి పిల్లలు తీసుకున్న ఆహారం నుంచి పోషకాలను గ్రహించి వారిని శక్తిహీనులుగా మారుస్తాయి. దీంతో పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి వంటి సమస్యలు ఏర్పడతాయి. అందువలన నులి పురుగుల నివారణకు ప్రభుత్వం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందిస్తోంది. దీనిలో భాగంగా గురువారం నుంచి పాఠశాలలు, అంగన్‌వాడీల్లో మాత్రల పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమాల్లో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సోంపేట: బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్



సంతబొమ్మాళి: దండుగోపాలపురం పాఠశాలలో...



వజ్రపుకొత్తూరు: బెజ్జివానిపేట పాఠశాలలో...



కంచిలి పాఠశాలలో...



ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం పాఠశాలలో...



కోటబొమ్మాళి బాలుర హైస్కూల్‌లో...



కోటబొమ్మాళి: కేజీబీవీలో...



కాశీబుగ్గ: 30వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో...



కాశీబుగ్గ: సూదికొండ యూపీ స్కూల్‌లో...



కవిటి ప్రాథమిక పాఠశాలలో...

# ప్రభుత్వాస్పత్రుల సేవలు వినియోగించుకోవాలి

- ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్
- సజావుగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: ప్రస్తుతం అభివృద్ధి దిశగా పయనిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన పలువురు అధికారులకు నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మాట్లాడుతూ.. కౌలురైతు గుర్తింపు కార్డుల ఆవశ్యకత, అర్హతలు తెలియజేశారు. మండలంలోని 50 శాతం మంది రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందజేయడం జరిగిందన్నారు. పాలవలస, బారువ, గొల్లూరు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ రేషన్ బియ్యంతో పాటు, పంచదార, కందిపప్పు అందజేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చాలా పంచాయతీల్లో పంచదార అందజేయడం లేదని తెలియజేశారు. కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.సౌజన్య గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రసాద్ ఇంటింటా కుళాయి పనులు వేగవంతం చేసి సకాలంలో నీరు అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీరాజ్ డీఈ సూర్యప్రకాష్ మాట్లాడుతూ సచివాలయాల భవన నిర్మాణాలు సెప్టెంబర్ నెలాఖరునాటికి పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సోంపేట ఎంపీటీసీలు పొడుగు కామేష్, ధర్మారావులు మాట్లాడుతూ.. పుణ్యస్త్రీ గెడ్డ పెద్ద కాన, చిన్న కాన మధ్యలో చెక్ డ్యామ్ నిర్మించి, ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తే వేలాది ఎకరాలకు సాగునీరందుతుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యపై చర్చించి రైతులకు సహకరించాలని కోరారు. సచివాలయాల్లో ఇటీవల బదిలీల నేపథ్యంలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని వైస్ ఎంపీపీ గురాల శ్రీను కోరారు. సమావేశంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, ఎంపీటీసీ మంగి గణపతి, సోంపేట, బారువ మేజర్ పంచాయతీల సర్పంచ్‌లు నగిరి ప్రభావతి, యర్ర రజనీ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన నామినేషన్ల గడువు

నందిగాం: మండలంలో అన్నాపురం పంచాయతీ సర్పంచ్ స్థానం, దిమ్మడిజోల, వల్లభరాయుడుపాడు, సుభద్రాపురం పంచాయతీల్లో ఒక్కో వార్డు మెంబర్‌కు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. గురువారంతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసిన నాటికి, అన్నాపురం సర్పంచ్ స్థానానికి బార్నాన తిరుపతిరావు, బార్నాన శేషగిరి, బార్నాన జగదాంబ, బార్నాన ఇంద్రవేణి, బార్నాన బాబూరావులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే దిమ్మడిజోల వార్డు మెంబర్‌కు పల్లి కుమారి ఒక్కరు మాత్రమే నామినేషన్ వేశారు. వల్లభరాయునిపాడు వార్డు మెంబర్ స్థానానికి పిరియా సూరమ్మ, మణిగాం గౌరమ్మ, సుభద్రాపురం వార్డు మెంబర్‌కు పల్ల కృష్ణారావు, బొడ్డాపు దుర్యోధనలు నామినేషన్లు వేశారు.

టెక్కలి: మండలంలోని నరసింగపల్లి పంచాయతీ పరిధి 7వ వార్డు పరిధిలో వార్డు మెంబర్ స్థానానికి గురువారం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ అధికారి నాగభూషణరావుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అభ్యర్థులతో పాటు సర్పంచ్ ఆర్.జయమోహన్, స్థానిక నాయకులు ఎం.భాస్కర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**దివ్యాంగుల ప్రయోజన గుర్తింపు శిబిరం నేడు**

పలాస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి దివ్యాంగులు, వయోవృద్ధుల బహుళ ప్రయోజన గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.రమేష్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వివిధ సహాయ ఉపకరణములు పొందదానికి వచ్చేవారు సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, యూడీఐడీ కార్డులతో హాజరవ్వాలని సూచించారు.

కవిటి: పలాస మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం అర్హులు సద్వినియోగం చేసుకునేవిధంగా మండలంలోని అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లకు బాధ్యతలు అప్పగించామన్నారు.

**పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ**

సోంపేట: మండలంలోని బేసిరామచంద్రాపురం ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు ఉమా మహాపాత్రో రూ.20 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను పాఠశాలకు గురువారం వితరణగా అందజేశారు. ఉమ మహాపాత్రో పాఠశాలలో 7 సంవత్సరాలు విధుల నిర్వహించి, ఇటీవల పదోన్నతిపై మెళియాపుట్టి పాఠశాలకు బదిలీపై వెల్లారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

**పథకాల అమలులో ప్రగతి సాధించాలి**

ఇచ్ఛాపురం: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ప్రగతి సాధించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో ఉన్న మెప్మా కార్యాలయంలో మెప్మా సిబ్బంది, ఆర్పీలతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంయూ సిబ్బంది రాము, ఎస్.వెంకట్రావు, బి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తమ్మతల్లి సన్నిధిలో అన్నదానం**

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి సన్నిధిలో గురువారం మధ్యాహ్నం 500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దాతల సహకారంతో ప్రతీ గురువారం, మంగళవారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవో వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించాలనుకునేవారు 98666 34812 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

**సమగ్ర భూసర్వేతో రైతులకు మేలు**

సోంపేట: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావులు అన్నారు. సచివాలయ పరిధిలో ఇటీవల మంజూరైన నూతన పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి చంద్రకళ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిరియా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**సమన్వయంతో ఈ–క్రాప్ బుకింగ్**

ఇచ్ఛాపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ శాఖ మరియు రెవెన్యూ శాఖ సమన్వయంతో ఈ–క్రాప్ బుకింగ్ చేయాలని మండల వ్యవసాయాధికారి తారపురెడ్డి భార్గవి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ప్రతీ రైతు పొలం వద్దకు వ్యవసాయ సిబ్బంది వెళ్లి ఫొటోలు తీసి, అక్కడి నుంచే మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పంట వివరాల నమోదు చేయాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సర్వే నంబర్ల ఆధారంగా జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ గణపతి, డిప్యూటీ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ బి.కె.వి.కుమారి, సివిల్ సప్లయ్ డీటీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**పక్కాగా పశు వ్యాక్సినేషన్**

మందస: పశువులకు అందించే వ్యాక్సినేషన్ ప్రక్రియ పక్కాగా జరగాలని జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిషోర్ అన్నారు. మండలంలోని హరిపురం పశు వైద్యశాలను గురువారం సందర్శించారు.

**పాత పింఛన్ విధానమే ముద్దు**

కాశీబుగ్గ: కొత్త పింఛన్ విధానం వద్దు పాత పింఛన్ విధానమే ముద్దు అని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్పీ సాహూ అన్నారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో నిరసన చేపట్టారు.



కవిటి: లండారిపుట్టుగలో మట్టిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

# స్వాతంత్య్ర స్ఫూర్తిని చాటుతూ...!

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని గ్రామాల్లో నా మట్టి – నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా పలు గ్రామాల్లో స్వాతంత్య్ర సమరయోధులకు గుర్తుగా శిలా ఫలకాలను గురువారం ఏర్పాటు చేశారు. 75 ఏళ్ల స్వాతంత్య్రానికి ప్రతీకగా 75 మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పలుచోట్ల విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



కంచిలి: జలంత్రకోటలో మొక్క నాటుతున్న జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: కొళిగాంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న దృశ్యం



సోంపేట: పాలవలసలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు



మందస: మూలిపాడులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న దృశ్యం



పలాస: శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో రమేష్‌నాయకుడు తదితరులు

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పిరియా విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- నువాడ పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం

కంచిలి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని జలంత్రకోట సచివాలయం పరిధి నువాడ పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నిరంతరం సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ సబితా గౌమాంగో, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రకాష్‌చంద్ర పండా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహన

టెక్కలి: స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో విద్యాంజలి విభాగం ఆధ్వర్యంలో సీఎస్ఈ విద్యార్థులకు 50 రకాల ప్రాజెక్టులపై అవగాహన కల్పించినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఢిల్లీకి చెందిన ఉమర్ మజీద్ సొదా, జామియా మిరియా ఇస్లామియా తదితర మైక్రోసాఫ్ట్ ఫ్రీ లాన్సర్ రీసెర్చ్ స్కాలర్ల నేతృత్వంలో అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. హెచ్‌టీఎంఎల్, ఎస్‌క్యూఎల్, ఎంక్యూఎల్, బ్లాక్‌చైన్, క్లౌడ్ కంప్యూటింగ్ తదితర అంశాలతో పాటు మరికొన్ని వెబ్ డవలప్‌మెంట్ అంశాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com